బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా అలేఖ్య ప్రతాప్


అలేఖ్య ప్రతాప్ నీలకంఠం

కంటోన్మెంట్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కంటోన్మెంట్‌కు చెందిన అలేఖ్య ప్రతాప్ నీలకంఠం నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బి. ఉమాశంకర్, అలేఖ్య ప్రతాప్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అలేఖ్య ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఓబీసీ మోర్చా బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో కీలక పదవి అప్పగించిన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్‌లో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వారాసీగూడ ఇన్‌స్పెక్టర్‌గా సైదులు



సికింద్రాబాద్: వారాసీగూడ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.సైదులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శంకర్‌ను మల్టీజోన్‌కు బదిలీ చేసిన సిటీ పోలీస్ కమిషనర్ ఆయన స్థానంలో సైదులును నియమించారు. రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలోని వివిధ పీఎస్‌లలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సైదులు బదిలీపై వారాసీగూడ పీఎస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కొత్త ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ని విస్తృతం చేసి నేరాలను అరికడుతామన్నారు.

నిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

లక్డీకాపూల్: నిమ్స్‌లో దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. శుక్రవారం ఆస్పత్రిని సందర్శించిన మంత్రికి నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. 306 డ్రాఫ్ట్ జీవోను గెజిట్ చేసిన తమ వేతనాలు పెంచడమే కాకుండా ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సీనియార్టీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు పర్మనెంట్ కార్మికులకు ఇస్తున్న వేతనాన్ని కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహులు పాల్గొన్నారు.


సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో శివుడికి అభిషేకం చేస్తున్న వెల్లాల రామ్మోహన్


శివుడి పూజలో మర్రి శశిధర్‌రెడ్డి..


బేగంపేట అల్లంతోటబావిలో శివలింగేశ్వర ఆలయంలో..

హర హర మహదేవ..


నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ ట్రస్టీ నాగులూరి సాయిబాబా


శ్రీ సిద్ధి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో..


పండ్లు,మంచినీటి బాటిళ్లను అందజేస్తున్న దృశ్యం

- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు..
- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు..

సనత్‌నగర్: హరిహర మహాదేవ...శంభో శంకర...శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. శుక్రవారం వేకువజామున 4.30 గంటల నుంచే ముక్కంటి ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంజునాథుడి దేవాలయ పరిసరాలు భక్తుల ఓం నమఃశ్శివాయ జపంతో భక్తిపారవశ్యంలో మునిగి తేలాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ముందుస్తుగానే ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. గంటల పాటు క్యూలో నిలబడి భక్తులు దైవ దర్శనం చేసుకున్నారు. శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో అర్థరాత్రి వరకు ప్రత్యేక పూజలు కొనసాగాయి. పలుచోట్ల జాగరణ చేసే భక్తుల కోసం గీతాలాపన, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చాలామంది భక్తులు రోజంతా ఉపవాస దీక్షలు చేపట్టి శివస్తుతిలో నిమగ్నమయ్యారు సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు కన్నులపండువగా జరిగాయి. తెల్లవారుజాము 4 గంటల నుంచే భక్తులు ఆలయం ముందు బారులుదీరారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది.

చిలకలగూడలో...

చిలకలగూడ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చిలకలగూడలోని పలు శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో లింగోద్భవం, శివపార్వతుల కళ్యాణంతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.

కిక్కిరిసిన ఆలయాలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు భక్తి ప్రపత్తుల మధ్య జరిగాయి. పెద్ద ఎత్తున ప్రజలు శివరాత్రి సందర్భంగా ఉపవాసాలు ఉండి తమ సమీపంలోని శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మోండా మార్కెట్ సమీపంలోని సుప్రసిద్ధమైన శివాలయం, లాలాగుడి, హమాల్‌బస్తీలోని శివాలయం, పద్మారావునగర్‌లోని పోల్‌బాల్ హనుమాన్ దేవాలయం, ఆర్పీ రోడ్డులోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయం, బోలక్‌పూర్‌లోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ప్రత్యేక పూజలు

అమీర్‌పేట : అమీర్‌పేట శ్రీ హనుమాన్ దేవాలయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం ప్రత్యేక అభిషేకము, లింగ స్పర్శదర్శనము,శివ పార్వతుల కళ్యాణోత్సవం నిర్వహించారు.

శివనామస్మరణ

రసూల్‌పురా: మహా శివరాత్రి సందర్భంగా కంటోన్మెంట్ లోని పలు శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మారుమ్రోగాయి. ఉదయం నుంచే భక్తులు శివయ్య దర్శనానికి బారులు తీరారు. బోయిన్‌పల్లి బోళాశంకర్ ఆలయం, సీతరాంపురం శివపంచాయతన, రసూల్‌పురా శివనగర్‌లోని శివాలయం.తవాయిపురా భవాని రామలింగేశ్వర స్వామి ఆలయం ఇతర ఆలయాల్లో రుద్రాభిషేకం, హోమాలు, శివపార్వతుల కళ్యాణం, లింగోద్భవం తదితర పూజలు జరిగాయి. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్ పాల్గొన్నారు.

అభిషేకాలు.. అర్చనలు

సికింద్రాబాద్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సీతాఫల్‌మండి ప్రాంతంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయాల్లో భక్తులు బారులు తీరి కనిపించారు. సీతాఫల్‌మండిలోని శ్రీరామలింగేశ్వర దేవాలయం, నామాలగుండులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లోని శివాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు చేయించుకున్నారు. రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించి భక్తులకు పండ్లు, ఫలహారాలను అందించారు.


శివానగర్ శివాలయంలో పూజలో పాల్గొన్న జంపన ప్రతాప్


నామాలగుండు వీరాంజనేయస్వామి దేవాలయంలో అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ


పాలాభిషేకం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్

వారాసిగూడలో మేడారం అర్చకుల పూజలు



సికింద్రాబాద్: వారాసిగూడకు వచ్చిన మేడారం శ్రీసమ్మక్క, సారలమ్మ దేవాలయ ప్రధాన అర్చకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారం దేవాలయ ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ సంజీవ్‌ముదిరాజ్ నివాసంలో జరిగిన అమ్మవార్ల పూజలను మేడారం అర్చకులు కాకా సారయ్య బృందం నిర్వహించింది.

మహిళలు సత్తా చాటాలి


అదనపు కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: మహిళలు ఏ రంగంలో పనిచేస్తున్నా తమ సత్తాను చాటాలని దేవదాయ ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీ దేవాలయంలో దేవాలయ అభివృద్ధి కమిటీ, లలితా సత్సంగ్ సభ్యుల ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ఇప్పుడు మహిళలందరూ పురుషులతో తాము సమానంగా అన్నింటిలో రాణిస్తున్నారని అన్నారు. ఇలాంటి వాళ్లను స్ఫూర్తిగా తీసుకుని తాము ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమం నాచారంగుట్ట దేవాలయ ఈవో అన్నపూర్ణ, రాజరాజేశ్వరీ దేవాలయ ఈవో చంద్రశేఖర్, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి


మహిళా దినోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ కె. హేమలత

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఘనంగా సత్కరించారు. బన్సీలాల్‌పేట్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కె. హేమలత ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు.

లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలి


స్పీకర్‌కు వినతిపత్రం అందిస్తున్న జిల్లా సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటును కోరుతూ లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఉమ్మడి హైదరాబాద్ జిల్లాలో సికింద్రాబాద్ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని స్పీకర్‌కు వివరించారు. ఇందుకు స్పందించిన స్పీకర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని హామీ ఇచ్చినట్టు పవన్ కుమార్‌గౌడ్ తెలిపారు. జిల్లా సాధన సమితి ప్రతినిధులు సాదం బాల్‌రాజ్‌యాదవ్, శైలేందర్, సునీల్‌ముదిరాజ్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులు హక్కుల కోసం పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజేశ్వర్ సాలొమన్

రాంగోపాల్‌పేట్: క్రైస్తవులు తమ హక్కుల కోసం ముందుకు వచ్చి పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని అమృతవాణిలో క్రైస్తవుల సమస్యలు-రాజ్యాంగ పరిష్కారం అనే అంశంపై క్రైస్తవ ప్రజాస్వామ్య ఉద్యమం అనే సంస్థ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించింది. తెలంగాణ జన సమితి పార్టీ ఉపాధ్యక్షులు పీఎల్ విశ్వేశ్వరరావు, లాలాగూడ క్రైస్ట్ చర్చి ప్రెస్బిటర్ ఇంచార్జ్ ప్రొఫెసర్ ఎం రాజేశ్వర్ సాలొమన్, ఆమ్ ఆద్మీపార్టీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తదితరులు హాజరై మాట్లాడారు. క్రైస్తవుల త్యాగాల మీద భారతదేశం నిర్మించబడిందని కానీ క్రైస్తవులు చేసినదాని గురించి మాట్లాడకపోవడం వలన క్రైస్తవులు ఏమి చేయలేదనే అబద్ధపు చరిత్రను రాస్తున్నారని అన్నారు. గాంధీ స్వాతంత్ర్య పోరాటం చేసేందుకు ముందు విదేశాల్లో ఉన్నపుడు ఉద్యమానికి పురిగొల్పింది ఒక మత బోధకుడని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మెలిక్ సెదెక్, సీపీఐ స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఏసు రత్నం, సీపీఎం నాయకులు ఎండీ అబ్బాస్, కిష్టఫర్ సుదాకర్, స్వర్ణకుమార్, లారెన్స్, ప్రసాదరావు, అబ్రహాం, అల్బర్ట్ కురేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో నర్సులకు సత్కారం


లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో నర్సులను సత్కరిస్తున్న వైద్యులు

అడ్డగుట్ట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రైల్వే ఆస్పత్రిలో గత 24 సంవత్సరాలుగా నర్సుగా పని చేస్తున్న జి. సుజాత అనే మహిళ కొంత కాలంగా ప్రాణాంతక వ్యాధి (ఇడియోపతిక్ పర్‌పురా)తో బాధపడుతున్నప్పటికీ రక్తం ఎక్కించుకుంటూ ఎంతో మంది పేషెంట్‌లకు తనవంతు సేవలందిస్తుందన్నారు. అంతే కాకుండా మరో పక్క తన కుటుంబ బాధ్యతలు చూసుకుంటూ తన బిడ్డను డాక్టర్‌గా తీర్చిదిద్దుతూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అదే విధంగా శ్రీలత అనే మరో నర్సు గత 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తుందన్నారు. హార్ట్ స్ట్రోక్ వచ్చిన ఎంతో మందికి ఐసీయూలో సేవలందించారని, కరోనా సమయంలో కూడా ప్రాణాలు లెక్క చేయకుండా రోగులకి విశిష్ట సేవలందించి మంచి నర్సుగా పేరు పొందిందన్నారు. అనంతరం, నర్సులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నిర్మల, పద్మ, ఏఎన్ఓ అంజలి, ఏఆర్ఎస్ఐ అధ్యక్షురాలు రేణుక, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుకు పట్టు వస్త్రాలు అందిస్తున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతాఫల్‌మండిలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి శ్రీపార్వతీరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండుంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను సీతాఫల్‌మండి పురవీధులగుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ శివశంకరులకు పట్టు వస్త్రాలను అందించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు, బీఎస్ఆర్ సంస్థల అధినేత బిట్ల రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు మురళీధరశర్మ తదితరులు పాల్గొన్నారు.

అఖండ జ్యోతి యాత్ర ప్రారంభం


యాత్రను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఐలయ్య

కాచిగూడ: లక్ష్మీనరసింహ స్వామి 30వ అఖండ జ్యోతి యాత్రను శుక్రవారం బర్కత్‌పురలో యాదాద్రి భవన్ వద్ద ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐలయ్య ప్రత్యేక పూజలు చేసి యాత్ర రథాన్ని కొద్ది దూరం నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అఖండ జ్యోతి రథయాత్రకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే యాత్రకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ.. కట్టుదిట్టమైన అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. రథయాత్ర ఈనెల 11వ తేదీ నాటికి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకృష్ణారావు, డీఈఓ భాస్కరశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ ఎల్లంపల్లి బుచ్చిరెడ్డి, శ్రీకాంత్ పడాల, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు, కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్‌యాదవ్, ఎ.సూర్య ప్రకాష్ సింగ్, పి.సురేశ్, ఏఈఓ రఘు పాల్గొన్నారు.

షీరో సంస్థకు ఉత్తమ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సంస్థ కోఆర్డినేటర్ విజయ్‌వర్మ

కాచిగూడ: దక్షిణాది రాష్ట్రాలలో రెండు వేలకు పైబడి మహిళలు తమ వంటకాలతో ఇంటి నుంచే స్థిరమైన ఆదాయం పొందేలా చేయూతనిస్తున్న షీరో హోమ్ ఫుడ్ సంస్థను 'ఉత్తమ హోమ్ ఫుడ్ అండ్ మహిళా ఉపాధి' పురస్కారం వరించింది. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలివేట్స్ ఎలైట్ సంస్థ వ్యవస్థాపకుడు రవికిశోర్ షీరో హోమ్ ఫుడ్ మహిళా సాధికారికత సంస్థ కోఆర్డినేటర్ పి.విజయ్‌వర్మకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌వర్మ మాట్లాడుతూ.. సంస్థ వ్యవస్థాపకులు తిలగరసు, జయశ్రీ మూడేళ్ల క్రితం ప్రారంభించిన షీరో ఉచిత ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఇప్పటి వరకు 2 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించామన్నారు. భవిష్యత్తులో మిలియన్ మంది మహిళలకు ఉపాధి ఇవ్వడమే సంస్థ లక్ష్యమని చెప్పారు. తెలుగు రాష్ట్రాల మాస్టర్ ఫ్రాంచైజీ ఓనర్‌గా వ్యవహరిస్తున్న సువర్ణాదేవికి ఈ అవార్డు దక్కడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జాతీయ ఫిలిం సెన్సార్‌బోర్డు మెంబర్ సిద్దవతం ప్రసన్నలక్ష్మి, మిసెస్ ఇండియా 2022 షెర్రీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీ-సేవా సెంటర్ డైరెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని ప్రత్యేకంగా 'మహిళా స్వయం ఉపాధి కంప్యూటర్ శిక్షణా పథకం' రూపొందించినట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన 500 మంది మహిళలకు ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా కంప్యూటర్ అప్లికేషన్స్, బ్యాంకింగ్, వివిధ ఆన్‌లైన్ సేవల నిర్వహణలో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత కేంద్ర ప్రభుత్వ ఆమోదిత సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన మహిళలు టీ-సేవ సెంటర్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్: 81799 55744లో తెలుసుకోవచ్చు.

స్టార్ మహిళా అవార్డులు అందజేత

చిక్కడపల్లి: అవని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా త్యాగరాయగానసభలో నిర్వహించిన స్టార్ మహిళా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన ప్రముఖ మహిళలకు అవార్డులు ప్రదానం చేశారు. దేశ ఔన్నత్యాన్ని పెంపొందించడంలో మహిళలు తమదైన పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ నారాయణ, కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, నిర్వహణ సంస్థ అధ్యక్షురాలు ఎస్. విజయ, ప్రముఖులు ఆనంద్‌రెడ్డి, పాండురంగ నాయక్, చంద్రజయ, సాజిదాఖాన్, కరుణకుమారి, శిరీష, గిరిబాల, ప్రియంవద, సురేఖ, వినీత రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి


శానిటరీ ప్యాడ్స్ అందజేసిన సేవా సమితి నిర్వాహకులు

అమీర్‌పేట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానంలో నిలవాలని రాయలసేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి. కుమార్, కార్యదర్శి విజయశ్రీ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అమీర్‌పేట ప్రభుత్వ వసతి గృహం విద్యార్థులతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శానిటరీ ప్యాడ్స్ అందజేశారు.

సమాజంలో వివక్షపై మహిళలు పోరాడాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా జేఏసీ చైర్‌పర్సన్ జయంతి గౌడ్

హిమాయత్‌నగర్: సమాజంలో మహిళలపై రోజురోజుకూ వివక్ష పెరుగుతున్నదని, ఆ వివక్షతను రూపుమాపేందుకు మహిళలు పోరాడాల్సిన అవసరం ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళ జేఏసీ చైర్‌పర్సన్ జయంతి గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలు అన్ని రంగంలో రాణిచాలని ఆకాంక్షిస్తున్నాన్నారు. నేడు మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పోటీ పడుతూ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఎక్కడో ఒక చోట మహిళలకు వివక్ష మాత్రం ఎదురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిని గౌరవించే వారే, స్త్రీలను గౌరవిస్తారన్నారు. దేశంలో మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ మహిళలపై అత్యాచారాలు, దారుణాలు చోటుచేసుకోవడం బాధాకారమన్నారు. కేవలం ఒక్క రోజుకే మహిళా దినోత్సవం పరిమితం కాకూడదని, మహిళలు అన్ని విధాలుగా అండగా ఉంటూ వారికి పూర్తి రక్షణ కల్పించినపుడే నిజమైన మహిళా దినోత్సవం అవుతుందన్నారు.

నగర పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

పంజగుట్ట: జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల సమయం మార్పు, వేతనం పెంపు విషయమై రాబోయే రెండు రోజుల్లో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత రాములు నాయక్ హామీ ఇచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జీహెచ్ఎంసీ మహిళా కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. యూనియర్ గౌరవాధ్యక్షుడు రాములు నాయక్, బీసీ సంఘం నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, కార్పొరేటర్లు వీరికి పనులు చెప్పడమే కానీ మహిళా దినోత్సవం రోజు కనీసం గౌరవించాలని తెలియకపోవడం బాధాకరమన్నారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులు అనూరాధ, లక్ష్మమ్మ మాట్లాడుతూ... తెల్లవారు జామున 4 గంటలకు డ్యూటీ ఎక్కినట్లు ఫింగర్ ప్రింట్ ఇవ్వాలని అంత ఉదయం బస్సులు ఉండవు, కొద్దిగా లేటైతే డ్యూటీకి రానట్లు చూపుతున్నారని సమయం వేలలు మార్చాలని కోరారు.